క్లుప్తంగా

అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడాలి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పని తీరు మెరుగ్గా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ అన్నారు. మండలంలో కె.ఎం.వలస, వండానపేట, చాటాయివలస తదితర అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. కేంద్రాల్లో రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతం కిట్లు వివరాలు సేకరించారు. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం పలుచోట్ల నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పరిశీలించారు.

దిశయాప్‌తో మహిళలకు రక్షణ

రేగిడి: దిశ యాప్‌తో మహిళలకు ఎంతో రక్షణ ఉంటుందని రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో దేవుదళ గ్రామంలోని కేజీబీవీలో విద్యార్థినులకు దిశయాప్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ ఇంటి వద్ద ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల గొడాం ఏర్పాటుకు చర్యలు

బాడంగి: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో నడుస్తున్న స్వయం సహాయక సంఘాల పొదుపు సొమ్ములతో స్థానికంగా వంట గ్యాస్ సిలిండర్ల గొడాం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఏపీఎం బాగ్యలక్ష్మితో పాటు ఎఫ్‌పీఓ ఏపీఎం రాము, సీసీలు కలసి బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అజురఫీజాన్‌ను కలసి ప్రభుత్వ స్థలం కేటాయింపు విషయంపై చర్చించారు. స్థానిక జగనన్న హౌసింగ్ కాలనీ సమీపంలో స్థలాన్ని కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. వారం పది రోజుల్లో సర్వే నంబరు, ప్లానింగ్‌తో కూడిన స్కెచ్ గీసీ అందజేస్తామని తహసీల్దార్ వారికి భరోసా ఇచ్చారు.

'ఉపాధి' పనుల గుర్తింపు

రాజాం: ఉపాధిహామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తిస్తున్నామని ఏపీఓ సాయిరాం అన్నారు. మండలంలో బొమ్మినాయుడువలస గ్రామ సచివాలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన పనుల వివరాలను సేకరించారు. గ్రామసభ ఆమోదం అనంతరం పనుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్, ఈసీ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించాలి

బొబ్బిలి: స్కూల్ కాంపెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను నిర్దీత సమయాల్లో పరిశీలన చేస్తుండాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజ్‌లో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓలతో సామర్థ్యాల పెంపుపై ఒకరోజు శిక్షణా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ డివిజన్‌లోని పది మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థుల భవిష్యత్తు అనుసరించి ప్రభుత్వం చేపడుతున్న అన్ని విద్యాభివృద్ధి కార్యక్రమాలపై నిశిత పరిశీలన, నివేదికల అందజేయాలన్నారు.

ముద్దాయికి జైలు, జరిమానా

రాజాం సిటీ: మండలంలోని పొగిరి, మొగిలివలస గ్రామాల్లో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. 2019 నవంబర్‌లో పొగిరి గ్రామానికి చెందిన జడ్డు లక్ష్మీనారాయణ, మొగిలివలస గ్రామానికి చెందిన మక్క లోకనాథం ఇళ్లల్లో జరిగిన దొంగతనంకు సంబంధించి అప్పటి సీఐ జి.సోమశేఖర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. చీపురుపల్లి మండలం పత్తికాయపాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబును అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును రికవరీ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆ కేసు బుధవారం రాజాం కోర్టులో విచారణకు వచ్చింది. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ ఒక్కో కేసులో పది నెలల కఠినకారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానాను విధించారని అన్నారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

రాజాం సిటీ: తన భార్య కనిపించడంలేదని ఆదర్శనగర్ కాలనీకి చెందిన మరిశర్ల శ్రీనివాస్‌నాయుడు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బీవీ రామకృష్ణారావు తెలిపారు. ఈ నెల 6న రాత్రి భోజనం చేసి నిద్రపోయామని, ఉదయం లేచి చూసేసరికి ఆమె కనిపించకపోవడంతో వీధిలో, బంధువల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం బాగులేకపోవడంతో మనోవేదనకు గురై ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కందిశలో అభివృద్ధి పనులు

రేగిడి: మండలంలో కందిశ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు సర్పంచ్ ప్రతినిధి కెల్ల మన్మథరావు తెలిపారు.

సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలో సేవలు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పోరాం లోని సచివాలయంలోని అందిస్తున్న సేవలును ఉద్యోగులును అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపి రిజినల్ కోర్దినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్నదొర

బొండపల్లి/మెంటాడ/సాలూరు: సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలోనే అన్ని సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఈ మేరకు మెంటాడ మండలంలోని పోరాం గ్రామంలో సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా బుధవారం గ్రామంలోని సచివాలయంతో పాటు, రైతు భరోసా కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ మహిళా పోలీసులు గ్రామంలో సక్రమంగా విధులను నిర్వహిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ గ్రామంలో విధులను నిర్వహిస్తున్నామని అందుకే గ్రామంలో తగాదాలు లేవని, మద్యం అక్రమంగా విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా పోలీస్ వివరించారు. గ్రామంలో పింఛన్లు అందుకుంటున్న వారు ఎంత మంది ఉన్నారని, గతంలో ఎంత మంది ఉండేవారని? ఇప్పుడు ఎంతమందికి ఇస్తున్నామని డిజిటల్ సహాయకుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌బీకేను పరిశీలించి రైతులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.

బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టిన గ్రామస్తులు

సామాజిక సాధికార బస్సు యాత్రకు పోరాం గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా బస్సు యాత్రకు స్వాగతం పలుకుతూ గ్రామంలోని అర్ అండ్‌బీ రోడ్డు నుంచి సచివాలయం వరకు చేపట్టిన గజపతినగరం మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల ప్రదర్శనతో పాటు, మెంటాడ మండలంలోని కంటుభుక్తవలస గ్రామానికి చెందిన మహిళల కోలాటం ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మానాపురం వరకు భారీ బైక్ ర్యాలీ

మెంటాడ మండలం పోరాం గ్రామానికి బస్సు యాత్రలో చేరుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ రాష్ట్ర నాయకులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం గ్రామం నుంచి వందలాది బైక్‌లతో దత్తిరాజేరు మండలం, మానాపురం మీదుగా రామభద్రపురం మండలం బూశాయవలస వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గం పరిశీలకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వర్రావు, పి.దుర్గ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, సర్పంచ్ ఎంపీటీసీలు రాగోలు వీరమ్మ, చెల్లూరు సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక రత్నాకర్, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

రాజాం: ప్రతీ గ్రామ సచివాలయంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించనున్నట్లు ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో కంచరాం గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 9న కంచరాం గ్రామ సచివాలయం-1 వద్ద ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలు, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించే బోర్డు ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. 10న కంచరాం-2, 14న బొద్దాం, 15న పొగిరి-1, 16న పొగిరి-2, 17న రాజయ్యపేట, 20న సోపేరు, 21న పెనుబాక, 22న గురవాం, 23న అంతకాపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రచార బోర్డుల ఆవిష్కరణ ఉంటుందని, ఈ మేరకు వలంటీర్లు, గ్రామసచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

రామభద్రపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరల్డ్ కప్ జరుగుతున్న దృష్ట్యా ఎంతటి వారైనా సరే క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్ అండ్‌బీ, పీఆర్ రోడ్లతో పోలిస్తే జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడంతో పాటు రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాలను నూటికి నూరు శాతం అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రతీ రోజూ వాహన తనిఖీలు చేపడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. గత రెండు మూడేళ్ల కంటే ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు : డీఎంహెచ్ఓ



తెర్లాం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

తెర్లాం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. తెర్లాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తల పనితీరుపై పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేయించుకోవడం ద్వారా కలిగే ఉపయోగాలను గ్రామాల్లోని గర్భిణులకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు వివరించాలని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వేరే ఆస్పత్రులకు తరలించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ భాస్కరరావు, ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమాన్ని క్షేత్రస్థాయిలో వివరించాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం



రాజాం: కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి చేపట్టనున్న 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి(వై ఏపీ నీడ్ జగన్)' కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. తొలిరోజు సంక్షేమ పథకాల ప్రచార బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరణ, వార్డు పెద్దలతో సమీక్ష, మరుసటిరోజు ఉదయం ఇంటింట ప్రచారం, మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు, మూడవ రోజు ఆ వార్డు సచివాలయ పెద్దలు, గృహసారథులు, వలంటీర్లు వంద కుటుంబాలను కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని, అలాగే గతంలో టీడీపీ ఇచ్చిన బూటకపు హామీలు ప్రజలకు గుర్తుచేయాలని సూచించారు. అనంతరం గృహసారథులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, జేసీఎస్ కన్వీనర్ సత్యనారాయణ, దూబ గోపాలం, పొట్నా సత్యనారాయణగుప్త, నల్లా శ్రీనివాసరావు, తోట తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 9 నుంచి చేపట్టనున్న 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలని అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ నవరత్నాల పథకాల ద్వారా ఎంతమేరకు ప్రజలకు లబ్ధి చేకూర్చారో, అభివృద్ధి పనులు ఏమి చేపట్టారో ఇంటింటికీ వెళ్లి వివరించనున్నట్లు చెప్పారు.

నేడు పారాదిలో..

బొబ్బిలి: మండలంలోని పారాదిలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెల్లడించింది. నాలుగేళ్లుగా సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయ బోర్డుల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆవిష్కరిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

బాడంగిలో...

బాడంగి: ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలన్న దానిపై మండలంలోని సచివాలయాల వారీగా ప్రజలకు వివరించి చెప్పాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు కోరారు. స్థానిక సచివాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఈ సచివాలయ పరిధిలో జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఏ విధంగా చేపట్టాలన్న దానిపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు దిశా నిర్దేశం చేశారు. ఓ రామలింగేశ్వరరావు, సీనియర్ సహాయకులు రాజు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, కార్యదర్శి సూర్యారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డీఈఓ

తెర్లాం: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసనా స్థాయిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. తెర్లాంలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను, వాటిని సరి చేస్తున్నారా, లేదా అనే అంశాలను ఆయన పరిశీలన చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా నిర్దీత గడువులోగా అన్ని సబ్జెక్ట్ సిలబస్‌ను అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిలో వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి అభ్యసనా స్థాయిని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు ఎంఈఓ త్రినాథరావు ఉన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: నవరత్న పథకాల అమలుతో ప్రతీ ఇంట్లో సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిపల్లిలో బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలపై ఆరాతీశారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు, స్థానిక నాయకులు లావేటి రమణ, మండల పరిషత్ సూపరింటెండెంట్ రఘునాథాచారి, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

జగనన్న ఆలోచనతోనే ప్రజా వైద్యం



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితోనే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరై వైద్య చికిత్సలు, మందుల సరఫరా వంటి కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మున్సిపల్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తరచూ తాగునీటి సమస్య రానీయకూడదు



మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ చెలికాని మురళి

బొబ్బిలి: పట్టణంలో తరచూ తాగునీటి పైపుల మరమ్మతులతో తాగునీటి సరఫరాలో సమస్యలు వస్తున్నాయని, ఎందుకు నిత్యం ఇవ్వడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి అధికారులను ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుమారు పది వార్డులకు పైగా తాగునీటిని సరఫరా చేయకపోవడానికి గల కారణాలను మున్సిపల్ ఏఈ సురేష్ వివరించారు. గురువారం నుంచి తాగునీటి సరఫరాను కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం రెండో వార్డు కౌన్సిలర్ కోట పెదరాములు మాట్లాడుతూ పాత బొబ్బిలిలో సామూహిక మరుగుదొడ్ల మోటారు పాడయి నీరు అందడం లేదని దీనికి సంబంధించిన పరికరాలను కూడా తొలగించారు తప్ప తిరిగి బాగు చేయలేదన్నారు. అనంతరం ఇటీవల మంజూరైన 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ మొదటి విడత గ్రాంటు రూ.72,13,216లతో వివిధ ప్రాంతాల్లో స్మశాన వాటికలకు ప్రహరీలు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదించి ఆమోదించారు. కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

బొబ్బిలి: పాఠశాల భవనాలను రెండు ఫేజులలో కోట్లాది రూపాయలు వెచ్చించి నాడు నేడు నిధులతో కొత్తరూపు సంతరించుకున్నట్టే ఎమ్మార్సీ భవనాలను కూడా మూడో ఫేజ్‌లో మరమ్మతులు, కొత్త భవనాలను నిర్మించనున్నట్టు విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. బుధవారం ఆమె పట్టణం, మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనాన్ని తొలుత పరిశీలించారు. అనంతరం మండలంలోని రంగరాయపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్ బుక్కులు, ఎస్సైన్‌మెంట్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వర్కుబుక్కులు పూర్తి స్థాయిలో పూరించనందున సంబంధిత ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని హెచ్‌ఎం, ఎంఈఓలను ఆదేశించారు. అలాగే కునుకువానివలసలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పఠనా సామర్థ్యాలు సక్రమంగా లేనందున అక్కడి ఉపాధ్యాయులు ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

మద్యం సీసాల పట్టివేత

రేగిడి: మండలంలో లచ్చారాయపురం గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్, ఎస్ఐలు ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి బుధవారం దాడిచేశారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సంక్షిప్తంగా...

ప్రత్యేక స్పందన రేపు



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండల కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని జెడ్పీ చైర్మన్ సరిపురపు జగన్మోహన్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవికుమార్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎంఎంఎస్ ఎన్నిక

వంగర: మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఏపీఎంలు మీసాల చక్రపాణి, టి.మంగమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా కాంబోతుల భగవతి, ఉపాధ్యక్షురాలుగా ముంజి ఉమావతి, కోశాధికారిగా గంటా సుమతి, సెక్రటరీగా కటిక అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీగా ఎస్.జానకమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద ఇంకుడుగుంతల ఏర్పాటు

రేగిడి: అన్ని పంచాయతీల్లో గ్రామ సచివాలయ భవన సముదాయాల వద్ద ఇంకుడుగుంతలు ఏర్పాటుచేయాలని ఏపీఓ హరనాథరావు సూచించారు. దేవుదళ గ్రామ సచివాలయం వద్ద నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా, కొలతలు ఆధారంగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. రూ.70 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కెంబూరు శ్రీహరిరావునాయుడు, సర్పంచ్ కుప్పిలి గవరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు, అయ్యప్ప మాలధారణ భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల రేజేటి సత్తిబాబు శర్మ, వంశీకష్ణ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులుక అన్నసంతర్పణ చేశారు.

ఎకరాకు సరాసరి 30 బస్తాల దిగుబడి

రేగిడి: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి బాగుందని, ఎకరాకు సరాసరి 30 బస్తాలకుపైగా దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, మండల ఉప గణాంక అధికారి ఏసుబాబు అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో సర్వే నంబరు 41లో గుడ్ల హేమలతకు చెందిన పొలంలో బుధవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మండలంలో ఈ ఏడాది 101 మంది రైతుల పొలాల్లో 144 పంటకోత ప్రయోగాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.మహేష్, వీఆర్‌ఏ నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కాలనీలో కాలువలు శుభ్రం చేయాలి

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీలో ఉన్న డ్రైనేజీలను పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలసి కాలనీలో పర్యటించారు. కాలువల్లో సిల్టు ఎక్కువగా ఉండటం చూసిన ఆయన సిబ్బందిని అప్రమత్తం చేశారు. అంతకు ముందు భోజరాజపురం ప్రధాన తాగునీటి వనరు వద్ద పరిశీలనలు చేసి అక్కడి మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా బంద్

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయడం తదితర ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన బంద్ విజయవంతమైంది. ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఓ తదితర విద్యార్థి సంఘాల నాయకులు వివిధ విద్యాసంస్థల వద్ద నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కేంద్ర ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు.

బంద్ పాక్షికం

బాడంగి: విద్యార్థి సంఘాల పిలుపుమేరకు విద్యా సంస్థల బంద్ కార్యక్రమం మండలంలో బుధవారం పాక్షికంగా జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా విద్యార్థి సంఘాలు పాఠశాలలను మూయించాయి. ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను, చంటి, వాసు, మణి, మహేష్ పాల్గొన్నారు.

చెరకును సంకిలి కర్మాగారానికి తరలించాలి

బొబ్బిలి: సీతానగరం, భీమసింగి చెరకు ఫ్యాక్టరీల పరిధిలో రైతులు పండించిన చెరకును సంకిలిలోని ఈఐడీ ప్యారీ కంపెనీకి తరలించాలని బొబ్బిలి డిప్యూటీ కేన్ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భీమసింగి ఫ్యాక్టరీ పరిధిలో 12వేల టన్నులు, సీతానగరం పరిధిలో 90వేల టన్నులు, సంకిలి పరిధిలో లక్షా 2వేల టన్నుల చెరకును గానుగ ఆడుతామని వివరించారు. ప్రభుత్వం చెరకు మద్దతు దరను రూ.3080లకు నిర్దేశించిందన్నారు. కంపెనీ తరఫున మరికొన్ని ఇన్‌సెంటివ్‌లు వచ్చే అవకాశముందన్నారు. త్వరలోనే కమిటీతో మాట్లాడి రైతులకు చెల్లించే మద్దతు ధర పూర్తి వివరాలను అందజేస్తామని తెలిపారు. రైతులు నేరుగా ఫ్యాక్టరీకి చెరకును తరలించాలన్నారు.

రూ.18 వేల విలువైన చుంచుబుడ్లు స్వాధీనం

రాజాం సిటీ: పట్టణంలోని లచ్చయ్యపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు నుంచి రూ.18 వేలు విలువైన సుమారు 4వేల చుంచుబుడ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామని సీఐ కె.రవికుమార్ బుధవారం తెలిపారు. లచ్చయ్యపేటలో మందుగుండు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై వై.రవికిరణ్, సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన కొనపల నాగేశ్వరరావు, బల్ల సురేష్ వద్ద 2713 చుంచుబుడ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.